# శాస్త్రపాఠము

ఒక సంవత్సరము చెన్నపట్టణములో కాపురము చేసి క్రొత్త బోధనా పద్ధతులు నేర్చుకొన్నాను. అవి శల్యగతము లగుటవల్ల మన పూర్వుల విద్యాభ్యాస క్రమముపై నాకు గౌరవము లేకపోయింది. ఈ నేర్చిన పద్ధతులన్నీ కొంతమట్టుకు క్లాసులలో ప్రయోగం చేయ మొదలు పెట్టాను. కాని దాని విలువ విద్యార్థులు గ్రహించకపోవుట చేత "ఓగు నోగు మెచ్చు" అనే వేమన్నపద్యం జ్ఞాపకం చేసుకొని మాట్లాడక ఊరుకొన్నాను. ఈ పద్ధతులను ఉపయోగించుటకు సమయము రాకపోతుందా అని ధైర్యము.

ధైర్యము ఎందుచేతనూ అంటే నాకు మూడేళ్ల ఈడు గల కొడుకు. వాడికి చదువు నేర్చుకొనుటకు తగిన వయస్సు-అనగా నాలుగు సంవత్సరములు వచ్చినట్లయితే సక్రమముగా పుస్తకాలలో వున్న రీతిగా బోధనపద్ధతులను ప్రయోగించి తద్వారా ఉత్తమవిద్య కరపించవలెనని నే నభ్యసించిన మానసిక శాస్త్రమును పురిస్కరించుకొని పని జరపినట్లయితే నా కొడుకు ప్రతిభాశాలి అవుతాడని నా ధైర్యం.

విద్యాభ్యాసమును ఓనమాలతో మొదలు పెట్టరాదు. వస్తువుల యథార్థ గుణ గ్రహాణము జ్ఞానేంద్రియములు చేయుచున్నవో లేదో తెలిసికొనవలెను. అట్లు చేయని యెడల వాని నభ్యాసపరిచి సరిగా గుణములు గ్రహించు నట్లు చేయవలెను. అనగా బాలుడు తొలుదొల్త ఓనమాలను

దిద్దుకొనుట మాని వేర్వేరు రుచుల దెలిసికొనుట, వేర్వేరు రంగుల దెలిసికొనుట, వేర్వేరు వాసనల దెలిసికొనుట, వేర్వేరు శబ్దముల గుర్తుబట్టుట, పదార్థముల వేర్వేరు స్థితులను తాకి తెలిసికొనుట నేర్చుకొనవలెను. అట్లు నేర్చుకొనుటవలన వారి జ్ఞానేంద్రియములు వస్తువుల యథార్థ గుణములను గ్రహింప గలిగి వుంటవి.

ఈ వుద్దేశముతో నేను ఒకనాడు నిమ్మకాయ, బెల్లం ముక్క, వక్కపొడి, పచ్చిమిరపకాయ ఇత్యాదులు రుచులు నేర్చుటకును, గన్నేరుపువ్వు, పచ్చగడ్డి, మల్లెపువ్వు, దేవకాంచనము, మసిబొగ్గు, పసుపుకొమ్ము ఇత్యాదులు రంగులు నేర్చుటకున్ను సంతరించుకొని మావాడిని దగ్గిర కూచోబెట్టుకున్నాను. మా అమ్మ దూరంగా కూచుని, పత్తి బుట్ట దగ్గిర పెట్టుకొని వత్తులు చేసుకొంటున్నది.

నేను చదువు చెప్పడం మొదలు పెట్టేను. ఏకాగ్రచిత్తముతో విషయగ్రహణము చేయగలిగి ఉండుటకు మావాడిని బాసినపట్టు వేసుకొని కూచోమన్నాను. విద్యాభ్యాససమయమునందు బాలురస్వేచ్ఛ నరికట్టుట మంచి పద్ధతి కాదు. అందుచేత బాసినపట్టు వేసుకొమ్మని చెప్పినా మావాడికి స్వేచ్ఛ నేను తగ్గించలేదు. రవంత సేపు బాసినపట్టు, రవంత సేపు పండుకోవడం, రవంత సేపు మొగ్గలు వేయడం, రవంత సేపు గంతులు వేయడం మొదలయిన పనులన్నీ చదువు నేర్చుకొనేటప్పుడు మావాడు చేస్తునే ఉన్నాడు. మొట్టమొదట గన్నేరుపువ్వు పుచ్చుకొని "నాన్నా, ఇదేమి?" టన్నాను.

"ఇది పువ్వు."

"దీని పే రేమిటి ?"

"దీని పేరేమిటి నాన్నా ?"

"నువ్వు చెప్పు."

"నువ్వు చెప్పవు నాన్నా ?"

"నేను చెప్ప కూడదు. నువ్వు చెప్పుకోవాలి."

"నేను చెప్పవచ్చునా నాన్నా ?"

"ఆ. చెప్పు."

"నేను చెప్పను. నువ్వు చెప్పుకో నాన్నా!"

"నాకూ తెలియదు. నువ్వు చెప్పు."

"నాకూ తెలియదు. నువ్వు చెప్పు."

"అయితే చెప్పుతాను విను. ఇది గన్నేరుపువ్వు."

"ఇది గన్నేరుపువ్వా నాన్నా ?"

"అవును."

"నువ్వెక్కడ తెచ్చావు నాన్నా దీనిని ?"

"దేవాలయం తోటలో నుంచి."

"నేనూ వెళ్లి తీసుకు రానా నాన్నా ?"

"వద్దు. నువ్వు అట్టే మాట్లాడకు. నేను చెప్పేది విను."

"మరి, గన్నేరుపువ్వు ఎందుకు తెచ్చావు నాన్నా ?"

"చెప్పుతాను గాని – ఇది ఎలా వుంది ?"

"మరి, నాకా పువ్వు ఇవ్వవు నానా ?"

"ఇందు, పుచ్చుకో. పుచ్చుకొని దానిరంగు ఏమిటో చెప్పుకో."

"దీని రంగా నాన్నా ?"

"అవును, అదుగో, దాని రేకులు లాగివేయకు, అలాగ నలిపి వేయకురా!"

"నలపనుగాని, నాకు ఇంకొక పువ్వు ఇవ్వవూ ?"

"ఇది అయిన తరవాత ఇస్తాను. నే నడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పు."

"ఏమి చెప్పను నాన్నా ?"

"దీని రంగు."

"దీని రంగా ?"

"అవును."

"నువ్వు చెప్పవు ? నాన్నా !"

"ఈ మాటు నేను చెప్పను. నువ్వు చెప్పుకోవాలి."

"ఏమి చెప్పుకోవాలి నాన్నా ?"

"దీని రంగు."

"అంటే ఏమిటి నాన్నా ?"

"ఇది తెలుపా, పసుపా, ఎరుపా, నలుపా చెప్పు."

"ఇదా ? నాన్నా ?"

"అవును."

"ఇది తెల్లగా ఉంది."

"ఇది తెల్లగా ఉందా ? పోనీ ఈ మల్లెపువ్వు ఎలా ఉంది."

"ఇదా నాన్నా ? ఇది ఎంచక్కుంది."

"దీని రంగు ?"

"తెల్లగా ఉంది."

"ఈ రెండూ తెల్లగానే ఉన్నాయా ?"

"తెల్లగా లేవు నాన్నా ?"

"లేవు, గన్నేరుపువ్వు ఎరుపు, మల్లెపువ్వు తెలుపు, మళ్లీ చెప్పు."

"ఇది ఎరుపు, ఇది తెలుపు."

"సరే, ఈ మసిబొగ్గు ఎలా వుంది ?"

"ఇదా ? యిది ఎఱ్ఱగా వుంది."

"ఇది ఎఱ్ఱగా వుందట్రా ?"

"మరి యెలా వుంది నాన్నా ?"

"నల్లగా వుంది."

"మసిబొగ్గు నల్లగా వుంది."

"సరే, ఈ పచ్చగడ్డి ?"

"ఇదీ ? ఇది నల్లగా వుంది."

"ఇది మసిబొగ్గులాగ వుందిరా ?"

"ఎలా వుంది మరి ?"

"ఇది ఆకుపచ్చగా వుంది."

"ఆకుపచ్చగా వుంది ?"

"సరే యీమాటు మళ్లీ చెప్పు. గన్నేరుపువ్వు ఎలా వుంది."

"ఎఱ్ఱగా వుంది."

"మసిబొగ్గు ?"

"నల్లగా వుంది."

"మల్లెపువ్వు ?"

"ఆకుపచ్చగా వుంది."

"ఆకుపచ్చ కాదు; తెలుపు ?"

"ఆకుపచ్చ గాదు; తెలుపు ?"

"పచ్చగడ్డి ?"

"పచ్చగడ్డి ఆకుపచ్చ కాదు –"

"ఆకుపచ్చే."

"ఆకుపచ్చగా వుంది."

"సరే, ఇది జ్ఞాపకం ఉంచుకొంటావు కదూ."

"అలాగే నాన్నా, నాకా బెల్లం ముక్క పెట్టవు ?"

"ఇంద. మరి అదంతా తినెయ్యకు."

ఇంతట్లో ఇంట్లోంచి నా భార్య కేక వేసింది "ఔనుగాని" కచేరీకి వేళ అయినట్లు వుంది. మీ అమ్మ వుండలేదు."

"కుఱ్ఱాడితో ఆడుకొనేబదులు స్నానం చెయ్యకూడదు?"

లేస్తూ ఉండగా మా అమ్మ వత్తులు పత్తిబుట్టలో పెట్టి మూతవేస్తూ అన్నదిగదా "అబ్బాయి! ఎప్పటి కప్పుడు వాడితో ఆడుతావు. వాడికి రెండుముక్కలు చెప్పుతూ వుంటేగాని వాడికి చదువు వచ్చేవిధం ఎలాగ?

మొత్తంమీద ఆడవాళ్లు—ఏమనడానికీ నోరురాదు.